నోటీస్ బోర్డు

- జై జవాన్, జైకిసాన్, జై కళాకార్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు మహతి కళాక్షేత్రంలో అన్నమయ్య సంగీత నృత్యోత్సవాలు ప్రారంభం.
- యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 5 గంటలకు గ్రీన్ జర్నలిస్టు అవార్డు గ్రహీత బీవీ రమణ అభినందన సభ

క్లుప్తంగా

అమ్మవారి ఆలయానికి గ్రైండర్ వితరణ



టిల్టింగ్ గ్రైండర్‌ను ఆలయానికి విరాళంగా అందజేస్తున్న దాతలు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి ఆలయానికి ఓ భక్తుడు టిల్టింగ్ గ్రైండర్‌ను విరాళంగా అందజేశారు. హైదరబాదుకు చెందిన రామకృష్ణారావు అమ్మవారి ప్రసాదం పోటులో వినియోగించేందుకు 20 లీటర్ల సామర్థ్యం గత టిల్టింగ్ గ్రైండర్‌ను గురువారం విరాళంగా ఆలయ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్‌కు అందజేశారు. అనంతరం దాతలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేసి, అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





జాకీర్ నాయక్, నటులు వాసుకి, శ్రియ

తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం ఎస్టీ కమిషన్ సభ్యుడు జాకీర్ నాయక్, ప్రముఖ సినీ నటులు వాసుకి, శ్రియ వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

అమ్మవారి సేవలో హీరోయిన్ శ్రియ

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ప్రముఖ సినీ నటి శ్రేయ గురువారం తెల్లవారుజామున దర్శించుకున్నారు.

ఎర్రచందనం కేసులో ఇద్దరికి ఐదేళ్లు జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కేసులో ఇద్దరికి ఐదేళ్లు జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.9 లక్షలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి గురువారం తీర్పు చెప్పారు. టాస్క్ ఫోర్స్ ఫారెస్ట్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. 2017లో చంద్రగిరి మండలానికి చెందిన గౌస్ బాషా, శివ తిరుపతి డివిజన్, నాగపట్ల బీట్ అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి ఎర్రచందనం చెట్లను నరికి తరలిస్తుండగా టాస్క్ ఫోర్స్ ఫారెస్ట్ సిబ్బంది అటకాయించి ఇద్దరినీ అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరికీ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

భయపెడుతున్న బయో వేస్ట్



రుయా ప్రాంగణంలో డంపింగ్ యార్డును తలపిస్తున్న బయో మెడికల్ వ్యర్థాలు

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలో బయో మెడికల్ వేస్ట్ భయపెడుతోంది. ఆస్పత్రి ప్రాంగణంలోని ఐడీహెచ్ వార్డు వెనుక వైపు టన్నులకు బయో మెడికల్ వేస్ట్ డంపింగ్ చేశారు. ప్రతిరోజూ బయో వేస్ట్‌ను ఆస్పత్రుల నుంచి తరలించాల్సి ఉన్నా గడిచిన ఆరు నెలలుగా వ్యర్థాలను తొలగించే చర్యలు చేపట్టలేదు. దీంతో టన్నుల కొద్దీ మెడికల్ వ్యర్థాలు పేరుకుపోయాయి. చెత్త వ్యర్థాలను సైతం వేరు చేయకుండా బయో మెడికల్లో పారవేశారు. పరిసర ప్రాంతాల్లో భూగర్భ నీరు ప్రమాదకర స్థాయి లో కలుషితమయ్యే అవకాశం ఉందని ఇదివరకే అధికారులు హెచ్చరించారు. అయినా నెలల తరబడి వ్యర్థాలను తొలగించక పోవడంతో చెత్తకుప్పలు గుట్టను తలపిస్తున్నాయి. దు ర్వాసనతో పాటు వ్యర్థాల నుంచి మురుగు కారుతుండడంతో అక్కడ భయానక పరిస్థితు లు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి పేరుకుపోయిన పదార్థాలను వెంట నే తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హుండీ ఆదాయం రూ.6.17 లక్షలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో గురువారం తిరుపతి డివిజన్ దేవాదాయ శాఖ తనిఖీదారులు పనిరాజశయన్ పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి లత ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఈఓ లత మాట్లాడుతూ 67 రోజులకు గాను దేవస్థానం హుండీల ద్వారా రూ.5,73,453, అన్నదాన హుండీ లెక్కింపు ద్వారా రూ.44,102 గాను మొత్తం 6,17,550 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మంచి కాదు.. వేధించే ప్రభుత్వం

వయసు ఉడిగి.. బిడ్డల ఆదరణ కరువై.. చేయి చాపేందుకు మనసు ఒప్పుకోక.. కాలం వెళ్లదీస్తున్న పండుటాకులపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పండుటాకులకు ఇబ్బంది లేకుండా తెల్లవారుజామునే వలంటీర్లతో పింఛన్ అందించి ఆత్మాభిమానానికి ప్రాణం పోస్తే .. కూటమి పాలన వచ్చాక వారిని ముప్పుతిప్పలు పెడుతోంది. ఇప్పుడు పింఛన్ వేళకు ఇచ్చి ఆదుకోండి మహాప్రభో అంటూ వేడుకుంటున్నారు. ఇంటి దగ్గరకు వచ్చి ఇచ్చే రేషన్ బియ్యాన్ని రాకుండా చేస్తుండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఫ్యామిలీ డివైడ్ అయిన వాళ్లు కొత్త రేషన్‌కార్డులు ఇస్తారేమో అని చూస్తే సర్వర్ సమస్య వేధిస్తోంది.



- నియంతలా వ్యవహరిస్తున్న సీఎం చంద్రబాబు
- సామాన్య, మధ్య తరగతి ప్రజలే టార్గెట్
- వలంటీర్ వ్యవస్థ తొలగింపుతో పింఛన్ తీసుకోవడానికి వృద్ధుల పాట్లు
- వచ్చే నెల నుంచి చౌకదుకాణాల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాలని ఆదేశాలు
- నూతన పింఛన్ల ఊసేలేదు
- కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తు చేసుకునేందుకు సర్వర్ సమస్యలు

తిరుపతి సిటీ: ఔరంగజేబు పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని మనం పుస్తకాల్లో చదువుకున్నాం.. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో అంతకుమించి కూటమి ప్రభుత్వంలోని పాలకులు పేదలు, మధ్య తరగతి ప్రజలను టార్గెట్ చేసుకుని హింసిస్తున్నారు. ఇంటి వద్దకు వచ్చి పింఛన్ అందించే వలంటీర్లను తొలగించి పండుటాకులకు ఇబ్బంది కలిగించారు. అంతటితో ఆగని కూటమి పాలకులు సామాన్యప్రజలు రేషన్ తీసుకోవడానికి ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ రెండు కార్యక్రమాలు దేశవ్యాప్తంగా మన్ననలు పొందాయి. అయితే కూటమి ప్రభుత్వంలోని చంద్రబాబుకు ఇది కంటగింపుగా మారింది. తన అనుకూల మీడియాను అడ్డుపెట్టుకుని పేదలపై కక్ష తీర్చుకోవడం మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే మొదట వలంటీర్ వ్యవస్థ తొలగింపు.. ఇప్పుడు రేషన్ పంపిణీ వాహనాలు రద్దు చేసి చౌకదుకాణాల వద్దే ప్రజలు సరుకులు తీసుకోవాలని నిర్ణయించారు. రేషన్ కోసం రెండుమూడు రోజులు పనులు వదులుకుని పడిగాపులు కాయాల్సి ఉంటుంది. దీనికితోడు కొత్త రేషన్ కార్డుల కోసం వేచి చూస్తున్న సర్వర్ సమస్య వేధిస్తోంది. దీనిపై సర్వత్రా ఆగ్రహజ్వాలలు వ్యక్తం అవుతున్నాయి.

కాళ్లరిగేలా తిరుగుతున్నా..



నా భర్త ప్రమాదంలో చనిపోయాడు. ఏడాది క్రితం పింఛన్కు దరఖాస్తు చేశాను. అప్పుడు ఎన్నికల కోడ్ ఉందని చెప్పారు. ఆ తరువాత కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మా ఊరు సచివాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా పింఛన్ మాత్రం రాలేదు. ప్రభుత్వం ఇంకా వదల్లేదు అని చెబుతున్నారు.

– ఎస్.భారతి, తుడా క్వార్టర్స్, తిరుమల నగర్ పంచాయతీ

అప్లికేషన్ తీసుకోవడం లేదు



పింఛన్ ఇవ్వడం దేవుడెరుగు.. దరఖాస్తు చేయడానికి కూడా అవకాశం లేదంటున్నారు. మా దగ్గర అప్లికేషన్ కూడా తీసుకోవడం లేదు. వృద్ధాప్య పింఛన్ కోసం తిరుగుతూనే ఉన్నా. మండల ఆఫీసు, సచివాలయం చుట్టూ తిరిగి, తిరిగి అలసి పోతున్నా.

– రాజేశ్వర్ రెడ్డి, మిట్టకండ్రిగ, ఆర్సీ పురం మండలం

మా పాపను చేర్చడానికి..



రేషన్ కార్డులో మా పాప పేరును కలపాలని తిరుగుతున్నా.. కార్డులో పేరు చేర్చడానికి ఏడాది నుంచి ఎదురు చూశాం. ఇప్పుడు అవకాశం ఇచ్చారని తెలిసి దరఖాస్తుకు వెళ్లాం. సర్వర్ పనిచేయడం లేదు.. మీ పాప ఆధార్ కేవైసీ కాలేదు.. అన్నీ ఉన్నా అధికార పార్టీ వాళ్లు చెబితేనే జరుగుతుందని చెబుతున్నారు. సచివాలయం వద్దకు వెళ్తే సమాధానం ఇవ్వరు. ఎవ్వరికి చెప్పాలో తెలియడం లేదు.

– లావణ్య, కుప్పం బాదూరు, ఆర్సీ పురం మండలం

నాకు పెన్షన్ రావడం లేదు..



నా భర్త రామయ్య చనిపోయి సుమారు ఏడాది కావొస్తున్నా ఇప్పటి వరకు నాకు పెన్షన్ మంజూరు కాలేదు. అధికారుల చుట్టూ పలుమార్లు తిరిగినా ఏదో ఒక కారణం చెప్పి తిప్పించుకుంటున్నారు. నేను ఏదో ఒక పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. నాకు వేరే ఆదాయ మార్గాలంటూ ఏమీ లేవు. అధికారులు స్పందించి నాకు వితంతు పింఛన్ ఇప్పించాలి.

– పి.రాణి, ఇరంగారిపల్లి పంచాయతీ, ముద్దలపల్లి, పాకాల మండలం

వేణుగోపాల్ లేఅవుట్ బాధితులకు సహకరిస్తాం

– ఇళ్లు కూల్చేసిన ప్రాంతాన్ని పరిశీలించిన అర్బన్ తహసీల్దార్



బాధితులతో మాట్లాడుతున్న అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి

తిరుపతి మంగళం : మంగళం తిరుమలనగర్ పంచాయతీ పరిధిలోని వేణుగోపాల్ లేఅవుట్ ఇప్పటికే కోర్టు వివాదంలో ఉందని, బాధితులకు కూడా కోర్టు ద్వారానే న్యాయం జరుగుతుందని తిరుపతి అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. గత రెండు రోజుల కిందట వేణుగోపాల్ లేఅవుట్‌లో సుమారు 60 ఇళ్లను గుర్తుతెలియని వ్యక్తులు కూల్చేసిన విషయం తెలిసిందే. దీనిపై గురువారం అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి వేణుగోపాల్ లేవుట్‌కు వెళ్లి కూల్చేసిన ఇళ్లను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. కోర్టు వివాదంలో ఉందని తెలిసి ఎలా కొనుగోలు చేశారంటూ బాధితులను ప్రశ్నించారు. కోర్టులో ఉన్న విషయం తమకు తెలియదని, తక్కువ ధరకే ప్లాట్లు విక్రయిస్తున్నారని తెలిసి కూలీనాలి చేసుకుని వచ్చిన డబ్బులతో కొనుగోలు చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటుకు సంబంధించిన భూ వివాదంలో రెవెన్యూ ఏమీ చేయలేదని, అయితే ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సహకారం అందిస్తామని తహసీల్దార్ తెలిపారు. రోడ్డున పడిన బాధితులకు రెవెన్యూ నుంచి పూర్తి సహకారం అందించాలని వామపక్ష నాయకులు తహసీల్దార్‌ను కోరారు. బాధితులకు న్యాయం జరిగేంతవరకు తాము అండగా ఉండి పోరాడతామని వామపక్షనేత వందాసి నాగరాజు, కేతారి రాధాకృష్ణ, పెచులయ్య, వేణుగోపాల్ చెప్పారు. కార్యక్రమంలో డీటీ రామచంద్రయ్య, వీఆర్‌ఓ ప్రసాద్, బాధితులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం



మురగన్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతికి విచ్చేసిన కేంద్రమంత్రి మురుగన్‌కు స్థానిక పద్మావతి అతిథిగృహం వద్ద బీజేపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. దుశ్శాలువతో సత్కరించి వేద ఆశీర్వచనం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుమల శ్రీవారి ఆశీస్సులతో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్ నాయుడు, మస్తాన్, లోక ప్రభాకర్ నాయుడు, సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విష్ణు నివాసంలో యాత్రికుల వెతలు




గదుల కోసం విష్ణునివాసం ఆవరణలో వేచిఉన్న యాత్రికులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తిరుమల శ్రీవారి దర్శనార్థం బస్సులు, రైళ్లల్లో సదూర ప్రాంతాల నుంచి తిరుపతి చేరుకున్న యాత్రికులకు కష్టాలు తప్పడం లేదు. దూరప్రయాణం చేసి అలసిన వారికి టీటీడీ బసకు సంబంధించి అరకొర ఏర్పాట్లతోనే నెట్టుకొస్తోంది. తిరుపతికి వచ్చిన యాత్రికుల్లో ఎక్కువ శాతం మంది టీటీడీకి చెందిన విష్ణునివాసం, శ్రీనివాసం, మాధవం వంటి నిలయాల్లో బస చేసేందుకు మక్కువ చూపుతున్నారు. శ్రీనివాసం, మాధవం నిలయాల్లో గదులు ఆన్‌లైన్‌లో మాత్రమే బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. కేవలం ఒక్క విష్ణునివాసంలో మాత్రమే ఆఫ్‌లైన్ ద్వారా యాత్రికులకు గదులను కేటాయిస్తున్నారు. ఇందులో మొత్తం 408 గదులు ఉండగా నాన్ ఏసీ 196, ఏసీ గదులు 196, నాన్ ఏసీ సూట్ 8, ఏసీ సూట్ గదులు 8 ఉన్నాయి. ఆన్‌లైన్ బుకింగ్ చేసుకునే విధానం తెలియని వారు, తెలిసినప్పటికీ ఆన్‌లైన్‌లో గదుల కోటా లభించని వారంతా ఒక్కసారిగా విష్ణు నివాసం చేరుకుంటుండడంతో గదుల కొరత ఏర్పడుతోంది. రైల్వేస్టేషన్‌కు ఎదురుగా విష్ణునివాసం ఉండడంతో యాత్రికులు విశ్రాంత గదులు ఆఫ్‌లైన్‌లో పొందేందుకు ఇష్టపడతారు. దీంతో బుకింగ్ కౌంటర్ వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రైవేటు రెసిడెన్సీలకు వెళ్లడానికి ఇష్టం లేని వారంతా టీటీడీ నిలయాల్లోనే బస చేయాలని వేచి ఉంటున్నారు. గురువారం మధ్యాహ్నం విష్ణునివాసం ప్రాంగణంలో అద్దె గదుల కోసం యాత్రికులు అధిక సంఖ్యలో వేచి ఉంటున్నారు. యాత్రికుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికార యంత్రాంగం సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలోని క్రికెటర్లకు సీపీఎల్ మంచి వేదిక





విజేత హైపీరియన్ జట్టుకు ట్రోఫీ, రూ.2 లక్షల నగదు బహుమతిని, రన్నర్ జట్టుకు ట్రోఫీ, రూ.1 లక్ష నగదు బహుమతిని అందజేస్తున్న జిల్లా కలెక్టర్, సీడీసీఏ అధ్యక్షుడు

- ముగిసిన సీపీఎల్ – 1
- విజేతగా నిలిచిన హైపీరియన్ జట్టు
- బహుమతులు ప్రదానం చేసిన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్రీడా మైదానం వేదికగా చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి నిర్వహిస్తున్న చిత్తూరు ప్రీమియర్ లీగ్ (సీపీఎల్–1) క్రికెట్ పోటీలు ఉత్కంఠంగా సాగాయి. ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాయ్ వైస్రాయ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. అనంతరం హైపీరియన్ జట్టు 15 ఓవర్లలోనే 1 వికెట్ నష్టపోయి 131 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. భవానీప్రసాద్ 47 బంతుల్లో 68 పరుగులు, కెప్టెన్ పృథ్వీరాజ్ 24 బంతుల్లో 32 పరుగులు, వెంకటేష్ 19 బంతుల్లో 27 పరుగులు చేసి జట్టుకు విజయాన్నందించారు. టాప్‌స్కోరర్ భవానీ ప్రసాద్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

జిల్లా క్రికెటర్లకు సీపీఎల్ చక్కని వేదిక

జిల్లాలోని క్రికెటర్లకు సీపీఎల్ చక్కని వేదికగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సీపీఎల్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమిష్టి కృషితో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఐపీఎల్ తరహాలో సీపీఎల్ నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ప్రత్యక్ష ప్రసారం ద్వారా నిర్వహిస్తున్న సీపీఎల్‌లో ప్రతిభ కనబరిచే జిల్లా క్రికెటర్లు ఏపీఎల్, ఐపీఎల్‌లో చోటు సంపాదించేందుకు మార్గం సుగుమం అవుతుందన్నారు. జిల్లాలో క్రికెట్‌ను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో తిరుపతిలోని గొల్లవానిగుంటలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాన్ని మరో నెల రోజుల్లో ప్రారంభించి అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. అలాగే తిరుపతిలో ఇండోర్ గేమ్స్ స్టేడియం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. సీడీసీఏ అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సీపీఎల్ సీజన్ 1 క్రీడాకారుల సహకారంతో విజయవంతం అయిందని, ఇదే స్ఫూర్తితో త్వరలో సీపీఎల్–2ను ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే యువ క్రికెటర్లను ప్రోత్సహించేందుకు త్వరలోనే అండర్–12 నుంచి అండర్–16లోపు మినీ వరల్డ్ కప్ పేరుతో క్రికెట్ పోటీలు జరుపుతామని చెప్పారు.

బహుమతుల అందజేత..

అనంతరం సీపీఎల్ సీజన్–1 విజేత హైపీరియన్ జట్టుకు ట్రోఫీ, రూ.2 లక్షల నగదు, రన్నర్‌గా నిలిచిన పాయ్ వైస్రాయ్ జట్టుకు ట్రోఫీ, రూ.1 లక్ష నగదు బహుమతిని, మూడవ స్థానంలో నిలిచిన ఆదిత్య జట్టుకు రూ.50 వేలు నగదు, ట్రోఫీని జిల్లా కలెక్టర్, సీడీసీఏ అధ్యక్షుల చేతుల మీదుగా అందజేశారు. అలాగే మ్యాన్ ఆఫ్ ది సీరీస్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఫీల్డర్, బెస్ట్ క్యాచర్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర, సీపీఎల్–1 ఫ్రాంచైజర్లు, సీడీసీఏ సభ్యులు, రంజీ ట్రోఫీ క్రీడాకారులు పాల్గొన్నారు.

నడవలూరు గంగమ్మకు సారె సమర్పణ



గంగమ్మకు సారెను తీసుకెళ్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

రామచంద్రాపురం(తిరుపతి రూరల్): రామచంద్రాపురం మండలం నడవలూరు గ్రామంలో జరిగే గంగమ్మ జాతర సందర్భంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డితో కలిసి సారె సమర్పించారు. అలాగే తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి సారెను తీసుకెళ్లి గురువారం జాతర నిర్వాహకులకు అందజేశారు. గ్రామంలోకి వచ్చిన భూమన, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి మహిళలు కర్పూర హారతులు ఇచ్చి సాదరంగా స్వాగతించారు. అనంతరం నడివీధి గంగమ్మకు సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

తొట్టెలనూ వదల్లేదు కదా సామీ..!



నిబంధనలకు విరుద్ధంగా గడ్డకిందపల్లిలో టీడీపీ నేత ఇంటి సమీపంలో నిర్మించిన నీటి తొట్టె

రామచంద్రాపురం(చంద్రగిరి): గ్రామాల్లో పశువుల దాహార్తిని తీర్చేందుకు ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్మించిన నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి. నిబంధనల మేరకు నీటి తొట్టెలను నిర్మించాల్సిన అధికారులు కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గారు. అన్నింటా అధికారాన్ని అడ్డుపెట్టుకుని అవినీతికి పాల్పడుతున్న కూటమి నేతలు ఆఖరికి పశువుల నీళ్ల తొట్టెలను కూడా వదల్లేదు. రామచంద్రాపురం మండలంలో ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద మంచినీటి తొట్టెల నిర్మాణం చేపట్టారు. మూగ జీవాల దాహార్తిని తీర్చడానికి అటవీ ప్రాంతాలు, గ్రామ సుదూర ప్రాంతాల్లో వాటిని నిర్మించాల్సి ఉండగా టీడీపీ నాయకుల ఇళ్ల వద్ద నీటి తొట్టెలను నిర్మించడం ద్వారా అవి పూర్తిగా నిరుపయోగంగా మారాయి. అధికారులు వే బిల్లుల్లో ఒక చోట, నిర్మాణం మరోచోట చేయడం కూడా విమర్శలకు తావిస్తోంది. వీటితో పాటు మరికొన్ని చోట్ల అసంపూర్తిగా నిర్మాణాలు, తొట్టెల్లో నీరు లేకపోవడంతో మూగజీవాలకు మేలు చేయకపోగా, కూటమి నేతల జేబులు మాత్రం నింపుకున్నారు.

సనాతన ధర్మం విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: సనాతన ధర్మం క్షేత్ర స్థాయి వరకు విస్తృతం చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలని టీటీడీ ఈఓ శ్యామలరావు ఆదేశించారు. గురువారం సాయంత్రం తిరుపతి శ్రీ పద్మావతి గెస్ట్ హౌస్‌లో హెచ్‌డీపీపీ, శ్రీనివాస కల్యాణం, అన్నమాచార్య, శ్రీ వేంకటేశ్వర రికార్డింగ్, పబ్లికేషన్, పురాణ ఇతిహాస, దాస సాహిత్య, ఎపిక్ స్టడీస్ వంటి ప్రాజెక్ట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని విస్తతంగా ప్రచారం చేయాలన్నారు. భగవద్గీతలోని ముఖ్యమైన ఘట్టాలను సరళతరం, సులభంగా ఉండేలా కార్టూన్, వీడియోల రూపంలో అందిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. హిందూ ధర్మం విశిష్టత, ధార్మిక, ఆధ్యాత్మిక, మానవీయత, నైతిక విలువల గురించి యువతకు తెలియజెప్పేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. చివరిదశలో ఎన్ని ఉన్నాయో సమగ్ర నివేదిక అందించాలని, టీటీడీ వెబ్‌సైట్‌లోని ప్రత్యేక యూట్యూబ్ చానెల్‌లో తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తలను అన్నింటినీ ఒకేచోట ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. టీటీడీ ముద్రించిన అన్ని పుస్తకాలు టీటీడీ బుక్ స్టాల్స్‌లో లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జేఈఓ వీరబ్రహ్మం, డీపీపీ సెక్రటరీ శ్రీరామ్ రఘునాథ్, ప్రత్యేక అధికారి రాజగోపాల్, అడిషనల్ సెక్రటరీ రామ్‌గోపాల్, అన్నమాచార్య ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి మేడసాని మోహన్, డైరెక్టర్ లత, దాస సాహిత్య ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసర్ రామానంద తీర్థాచార్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత వల్లివేడు కింగ్స్ ఎలెవన్



ట్రోఫీతో వల్లివేడు కింగ్స్ ఎలెవెన్స్ జట్టు

పాకాల : మండలంలో వల్లివేడు గ్రామంలో నిర్వహించిన వీవీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో వల్లివేడు కింగ్స్ లెవెన్స్ జట్టు ఫైనల్స్‌లో విజేతలుగా నిలిచారు. వీవీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వల్లివేడు విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. యువకుల్లో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికి తీసేందుకు టోర్నమెంట్‌ను నిర్వహించినట్లు విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో మొత్తం 40 జట్లు పాల్గొన్నాయి. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వల్లివేడు కింగ్స్ లెవెన్స్, రొంపిచెర్ల మండలం ఫ్రెండ్స్ లెవెన్స్ జట్లు తలపడగా వల్లివేడు కింగ్స్ లెవెన్స్ విజయం సాధించింది. టోర్నమెంట్ నిర్వాహకుడు విక్రమ్‌రెడ్డి చేతుల మీదుగా విజేతలకు ట్రోఫీలతో పాటు రూ.30,116, రన్నర్స్‌కు రూ.14,500 అందజేశారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ టీంలో రమేష్, ప్రవీణ్‌రెడ్డి, ఉమాపతి ఉన్నారు.

పేదల ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోండి



ఇళ్లు కూల్చేసిన ఫొటోలను ప్రదర్శిస్తున్న వామపక్ష, ప్రజా సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్: మంగళం రోడ్డులోని తిరుమల నగర్ పంచాయతీ, వేణుగోపాల్ కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేదల ఇళ్లను ఈనెల 26న అర్ధరాత్రి 300 మంది రౌడీషీటర్లు జేసీబీలతో వచ్చి కూల్చేయడం అప్రజాస్వామికమని, వారిపై తక్షణం చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని వామపక్ష, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సీపీఐ నేత చిన్నం పెంచలయ్య, ఏఐటీయూసీ నేత రాధాకృష్ణ, ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య మాట్లాడారు. ఈ సంఘటనపై తాము జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి వెంటనే చర్యలు తీసుకోమని ఆదేశించినా అధికారులు నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించడం చూస్తే నిందితులకు ఒత్తాసు పలుకుతున్నారేమో అనే అనుమానం కలుగుతోందన్నారు. బాధితులకు న్యాయం చేయకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



జేవీవీ అందించిన పుస్తకాలతో విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎమ్మార్‌పల్లిలోని బాలల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లోని విద్యార్థులకు గురువారం జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప మాట్లాడుతూ తమ కార్యకర్తలు రీసోర్స్ పర్సన్లుగా నెల రోజుల నుంచి ఇక్కడి విద్యార్థులకు వినోదం, విజ్ఞానం, సృజనాత్మకతను నేర్పించినట్లు తెలిపారు. దీనితో పాటు ఇంగ్లిష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిష్, శాస్త్రీయ దృక్పథ అంశాలను నేర్పించినట్లు చెప్పారు. వీటికి సంబంధించిన పుస్తకాలను యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ముత్యాల రెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం సోమశేఖర్ చేతుల మీదుగా అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టిస్ట్ గాయత్రి, జేవీవీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.